తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
31 అక్టోబర్ 2026
Follow :

త్రాగునీరు వృధా చేయవద్దు: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

- జిల్లాలో ఎల్‌నీనో ప్రభావం సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పటిష్ట ప్రణాళిక
- ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండింగ్ పూర్తి కావాలి
- బివిజిరామ్‌జి ఉపాధి పనులలో కూలీలను పెంచాలి

కౌడిపల్లి, అక్టోబర్ 30(జనంసాక్షి): త్రాగునీటిని వృధా చేయొద్దని, ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండింగ్ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. శుక్రవారం కౌడిపల్లి మండలం ధర్మసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, గ్రామంలోని నీటి వనరుల లభ్యత ఇందిరమ్మ ఇండ్లు, బివిజిరామ్ పనులపై ఎంపీడీవోతో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయంలో సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌నీనో ప్రభావం వల్ల త్రాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున, ప్రజలందరూ త్రాగునీటిని వృధా చేయొద్దని, నీటిని సంరక్షించాలన్నారు.
గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మొదటి ,రెండవ దశ ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తిచేయాలని సూచించారు. ఇందిరమ్మ

ఇండ్లు మంజూరు అయ్యి మొదలు పెట్టిన వారిని మోటివేషన్ చేసి, అధికారుల సూచనలతో తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. బివిజిరామ్‌జి ఉపాధి హామీ పథకంలో అనేక రకాల పనులు ఉన్నాయని, ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్యను పెంచి ఉపాధి కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ శివానందరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కానూన్ జానో, బచ్పన్ బచావో...

గద్వాల నడిగడ్డ,ఆగస్టు 30(జనంసాక్షి);
జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గద్వాల పట్టణంలోని సరస్వతి విద్యా మందిర్, విశ్వేశ్వరయ్య హైస్కూల్, బెటర్ లైఫ్ మోడల్ స్కూల్, మల్లకల్ మండలంలోని పాల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కానూన్ జానో, బచ్పన్ బచావో అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం బాలలపై జరిగే లైంగిక నేరాల నివారణ, బాలల హక్కుల పరిరక్షణ, పోక్సో చట్టం, 2012పై అవగాహన కల్పించడం, అలాగే బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన బాధిత బాలలకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయ సేవల గురించి విద్యార్థులకు తెలియజేశారు.ముఖ్య అతిథులుగా వి. శ్రీనివాస్, ప్రత్యేక సెషన్స్ జడ్జి, పోక్సో కోర్టు, గద్వాల జి. నిష్మా పాత్రుడు, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రత్యేక సెషన్స్ జడ్జి వి. శ్రీనివాస్ మాట్లాడుతూ బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై పోక్సో చట్టం, 2012 ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని వివరించారు. పిల్లలు తమకు ఎదురయ్యే వేధింపులు లేదా అనుచిత ప్రవర్తన గురించి భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని తెలిపారు.
జి. నిష్మా పాత్రుడు మాట్లాడుతూ ప్రతి చిన్నారికి భయం లేని, సురక్షితమైన బాల్యాన్ని కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాలల హక్కులను కాపాడటంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని, బాలలపై జరిగే నేరాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వై. మొగలయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ బీచుపల్లి, పారా లీగల్ వాలంటీర్ టి. వెంకటరాముడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు

- సిద్దిపేట కలెక్టర్ కే.హైమావతి

చేర్యాల, అక్టోబర్ 30 (జనంసాక్షి): ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి హెచ్చరించారు. శుక్రవారం చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని సర్వే నెంబర్ 1197లో గల ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ కె.హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.1197 సర్వే నెంబర్ లో గతంలో ఎంత ప్రభుత్వ భూమి ఉండేది, ప్రస్తుతం ఎంత

ఉంది అనే వివరాలను పాత రికార్డులన్నీ వెరిఫై చేయాలని సర్వే అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే హద్దురాళ్లు వేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీవాస్య సందీప్, సర్వే అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

వోక్సెన్ యూనివర్సిటీలో క్రీడా పోటీల ఏర్పాట్ల పరిశీలన

- క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 30 (జనంసాక్షి): కంకోల్‌లోని వోక్సెన్ యూనివర్సిటీలో నవంబర్ 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీల ఏర్పాట్లను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి యూనివర్సిటీని సందర్శించి క్రీడా మైదానాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... జాతీయ స్థాయి క్రీడా పోటీలను వోక్సెన్ యూనివర్సిటీలో నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వసతి, భోజనం, రవాణా తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పూర్తిచేసిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, డీఎస్పీ సత్తయ్య గౌడ్, ఎంపీడీవో అంజయ్య, ఉప తహసీల్దార్ ప్రదీప్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరువు నివారణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి
- మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 30 (జనంసాక్షి): రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
పెంట్లవెల్లి, నవాబుపేట ప్రాంతాల్లో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా కరువు మండలాలుగా ప్రకటించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.
అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల పరిస్థితులను అంచనా వేసి కరువు మండలాలను ప్రకటించాలని కోరారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం లేక రైతులు పశుసంపదను అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
2015–16లో ఎల్‌నినో ప్రభావంతో కరువు ఏర్పడినప్పుడు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ, చెరువుల నిర్మాణం, సాగునీటి కాలువలు, ఉపాధి హామీ పనిదినాల పెంపు, పశుగ్రాసానికి సబ్సిడీ వంటి చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా ఏపీకి నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు.
పాలమూరు ప్రాంత ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేఎల్ఐ పంపులను వెంటనే ప్రారంభించి నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్లను నీటితో నింపాలని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు.
రైతులకు పంట నష్టపరిహారం, పశుగ్రాసం, తాగునీరు అందించడంతో పాటు ఉపాధి హామీ పనులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

టైర్ల లారీల రవాణాలో భద్రత ఏదీ?

- అధిక ఎత్తులో టైర్ల లోడు.. ప్రమాదం అంచున ప్రయాణం
- విద్యుత్ తీగలకు తగిలేలా టైర్ల లోడు..
- అధికారులకు కనిపించడం లేదా?
- ఎదురుగూడెం, మల్లేపల్లి మీదుగా భారీ లారీలు.. ప్రజల్లో ఆందోళన

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 30 (జనంసాక్షి): మండల పరిధిలోని ఎదురుగూడెం, మల్లేపల్లి గ్రామాల్లో ఉన్న టైర్ల కంపెనీకి ఇతర ప్రాంతాల నుంచి భారీ లారీల ద్వారా టైర్లను తరలిస్తున్న తీరుపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణా సమయంలో తగిన భద్రతా జాగ్రత్తలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారి నుంచి ఎదురుగూడెం, మల్లేపల్లి గ్రామాల్లోని కంపెనీకి వెళ్లే మార్గంలో ఉన్న మల్కాపూర్ ఎక్స్‌రోడ్డు చౌరస్తా వద్ద భారీగా టైర్లు పేర్చిన ఓ లారీ మలుపు తిరగడానికి ఇబ్బందులు ఎదుర్కొంది. టైర్లను అధిక ఎత్తులో పేర్చడంతో పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలే ప్రమాదం ఉందని డ్రైవర్ ఆందోళనకు గురయ్యాడు. ఈ ఘటనతో కొద్దిసేపు ప్రయాణికులకు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. టైర్లను లారీల్లో తరలించే సమయంలో నిబంధనలు పాటిస్తున్నారా? అవసరమైన అనుమతులు ఉన్నాయా? లోడును సురక్షితంగా ఏర్పాటు చేస్తున్నారా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు. నిర్లక్ష్యంగా రవాణా చేస్తే విద్యుత్ ప్రమాదాలతో పాటు రహదారిపై ప్రయాణించే ప్రజలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత రవాణా, పోలీసు, విద్యుత్ శాఖల అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధిత కంపెనీ యాజమాన్యం, రవాణా నిర్వాహకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటారా? లేదా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

తల్లి కోసం ఏడుపాయలకు వెళ్లి..

పాపన్నపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి): వృద్ధురాలైన తన తల్లి కోసం ఏడుపాయలకు వెళ్లిన ఓ వ్యక్తి అనంత లోకానికి చేరాడు. ఈ విషాద సంఘటన మెదక్ జిల్లాలో వెలుగు చూసింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు .. పాపన్నపేట గ్రామా నికి చెందిన ఆకుల క్రిష్ణ (40) కూలీ పనులు చేస్తూ జీవితం గడుపుతున్నాడు. ఏడుపాయల ఆలయం వద్ద ఉన్న తన తల్లి అంజమ్మ వద్దకు గురువారం రాత్రి వెళ్లాడు. శుక్రవారం ఉదయం స్నానం చేసేందుకు ఏడుపాయల చెక్ డ్యాం వద్దకు వెళ్లి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ల సాయంతో నీటిలో గాలింపు చేపట్టగా అతడి మృతదేహం లభ్యమైంది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి.. రక్తదానంతో సేవా కార్యక్రమం

- రక్తదానం ప్రాణదానంతో సమానం: జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

రామాయంపేట,అక్టోబర్ 30 (జనంసాక్షి): రామాయంపేట, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న పది రోజుల సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రామాయంపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.రామాయంపేట పోలీస్ శాఖ,లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహబంధు, మెడిసిటీ ఆసుపత్రి వైద్య బృందం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సమాజ సేవలో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ శిబిరంలో పలువురు యువకులు, పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.

అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ ప్రజాసేవలో భాగస్వాములు కావడం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్ గౌడ్, రామాయంపేట సీఐ సైదా నాయక్,ఎస్ఐ బాలరాజు, నరేష్, నిజాంపేట ఎస్ఐ రాజేష్, నార్సింగి ఎస్ఐ, వివిధ గ్రామాల సర్పంచ్ లు దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాలరాజు, లక్ష్మాపూర్ సర్పంచ్ నవీన్ గౌడ్,శివాయపల్లి సర్పంచ్ రవి,రాయలాపూర్ ఉపసర్పంచ్ ప్రశాంత్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దామోదర్ రావు, సభ్యులు జీకే కృష్ణమూర్తి,జనతా మెస్ శ్రీనివాసరావు, లయన్స్ బాలరాజు,సతీష్,తమ్మల రమేష్, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి మృత దేహం లభ్యం...

అల్లాదుర్గం, అక్టోబర్ 30 (జనంసాక్షి): అల్లాదుర్గం శివారు లోని 161 జాతీయ రహదారి పక్కన పాత చర్చి వెనుకాల ఉన్న కాయితం పల్లి రాములు పొలం పక్కన గుర్తు తెలియని శవం పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు నారాయణ ఖేడ్ గ్రామానికి చెందిన చాకలి రవి (30) గా తెలుసుకొని మృతుడి మేనమామ అయినటు వంటి చాకలి మారుతి పిర్యాదు మేరకు బాడీని పోస్టు మార్టం నిమిత్తం జోగిపేటకు తరలించినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

నాగ్‌పూర్ ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

శివ్వంపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానవర్గం పిలుపుమేరకు ఢిల్లీలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు శివంపేట మండలం నుంచి ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో వందలాది కార్ల కాన్వాయ్ తో శుక్రవారం ఉదయం ఢిల్లీ కి తరలి వెళ్లారు. అయితే కారు ర్యాలీ మహారాష్ట్రలోని నాగ్ పూర్ కు చేరుకోగానే నాగపూర్ ఎమ్మెల్సీ అభిజిత్ సారథ్యంలో వారి శ్రేణులు వీరికి ఘన స్వాగతం పలికి ఆయన నివాసానికి తోలుకొని వెళ్లారు. అక్కడ పలువురి నాయకులకు శాలువాతో సన్మానించి, తేనేటి విందు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి సాయంత్రం కార్ ర్యాలీ ఢిల్లీకి బయలుదేరి వెళ్లిందని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్ రాజ్ సెట్ మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

ఎన్నికల హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి
- పీఆర్సీ ప్రకటించాలి.. పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- తపస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 30 (జనంసాక్షి): సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యదర్శి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమీన్‌పూర్, ఆర్‌సీపురం మండలాల్లోని వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ… కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ ఒకేసారి చెల్లించాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీవో 25ను సవరించి, ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు పెంట్యానాయక్, జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్, మండల ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించవద్దు...

శివ్వంపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి): కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గైనిబైటి ప్రవీణ్ గౌడ్, చండీ రామేశ్వరం రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి లు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చండి గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించేందుకు వీలుగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా రైతులకు తమ పంటను విక్రయించుకోవడంలో సౌకర్యం కలుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ గౌడ్, చండీ రామేశ్వరం రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు డి. శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వీణ, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్ రావు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత

సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: సర్పంచ్ శశికళ!

- విద్యార్థులతో కలిసి గుండేడులో అవగాహన ర్యాలీ!

బాలానగర్, అక్టోబర్ 30 (జనంసాక్షి): బాలనగర్ మండలంలోని గుండేడు గ్రామంలో నేడు మాదక ద్రవ్యాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల రహిత గ్రామంగా, మండలంగా, రాష్ట్రంగా, దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గుండేడు గ్రామ సర్పంచ్ శశికళ పిలుపునిచ్చారు. శనివారం బాలానగర్ మండల పరిధిలోని గుండేడు గ్రామంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ వివిధ నినాదాలతో కూడిన ప్లకార్డులను చేతబట్టి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని సర్పంచ్ శశికళ పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామ పెద్దలు పవన్, ఉపాధ్యాయులు, సత్యనారాయణ, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పారిశుధ్య కార్యక్రమం

- స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా శుభ్రత పనులు
- ఉత్తమ సిబ్బందికి సన్మానం

చేర్యాల, అక్టోబర్ 30(జనంసాక్షి): చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. భారత ప్రభుత్వ మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ సూచనల మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం 6.0 లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో కార్యాలయ ఆవరణను శుభ్రం చేయించారు. అనంతరం పారిశుధ్య పనుల్లో చురుగ్గా పాల్గొన్న ఐదుగురు సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అభిలాష్, మేనేజర్ ప్రభాకర్, సబ్ రిజిస్ట్రార్ మనోహర్, సీడీపీఓ సిబ్బంది, కౌన్సిలర్లు గీతాంజలి, కొమ్ము రాజేశ్వరి, సుప్రజా, మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

- 12వ వార్డు కౌన్సిలర్ షరీఫా బేగం కాజా

చేర్యాల, అక్టోబర్30(జనంసాక్షి): త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని 12వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం ఖాజ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డిగ్రీ పూర్తి చేసి మూడు సంవత్సరాలు గడిచిన ప్రతి పట్టభద్రుడు, గతంలో ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న వారు కూడా తిరిగి ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఓటరు నమోదుకు నవంబర్ 6న చివరి గడువు ఉందని పేర్కొన్నారు. పట్టభద్రులందరూ తమ అమూల్యమైన ఓటును ఆయుధంగా మలచి, రేవంత్ రెడ్డి నాయకత్వంలో సమర్థవంతమైన పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

జాతీయ రహదారిపై ధాన్యం ఆరబోతతో ప్రమాదకరం

- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

నిజాంపేట్, అక్టోబర్ 30 (జనంసాక్షి): జాతీయ రహదారి ఎన్.హెచ్చర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోయ వద్దు, ప్రమాదాలకు కారణం కావద్దని సీఐ వెంకట్ రెడ్డి వివర్తలకు వెళ్తే. నిజాంపేట్ బాచేపల్లి శివారు ప్రాంతాల్లో కొంత మంది రైతులు, వ్యాపారులు రహదారులపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పైన రాత్రి సమయంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం సరిగా కనిపించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు: రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచించిన నిర్దిష్ట కల్లాల్లోనే ధాన్యం ఆరబోసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని

ఓటు హక్కును ప్రతి గ్రాడ్యుయేట్ వినియోగించుకోవాలి

- గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్

వెల్దండ అక్టోబర్ 30 (జనంసాక్షి): ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం వెల్దండ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి. కార్తీక్ కుమార్ కి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు పత్రాలను సర్పంచ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవడం తమ బాధ్యత అని, ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని తెలిపారు. గ్రామంలోని అర్హులైన పట్టభద్రు లందరూ ముందుకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఓటు నమోదుకు చివరి తేదీ లోపు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొయ్యల పుల్లయ్య, రేవల్లి రాజు, బొక్కల శ్రీను , మట్ట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా డంపింగ్ యార్డు కూల్చివేత, భూకబ్జా ప్రయత్నం

- నిందితులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు

చేర్యాల, అక్టోబర్ 30(జనంసాక్షి): కమలాయపల్లి గ్రామ డంపింగ్ షెడ్ కూల్చిన ఖానాపూర్ గ్రామానికి చెందిన వంటేరు శ్రీనివాస్ రెడ్డి, తన అనుచరులతో కలిసి ప్రభుత్వ డంపింగ్ యార్డు కూల్చివేసినా సమయంలో గ్రామస్తులు వెళ్లి అడ్డుకున్నారు. అదే సమయంలో నీల కిష్టవ్వ, చీకట్ల జయమ్మ భూమిలో కనీలు పాతి భూకబ్జా చేసే ప్రయత్నం చేశారు. ఈ భూమి వారి ఎవరైతే కబ్జాలో ఉన్నారో వారు తాతముత్తల నుండి కబ్జా అలాగే కాస్తులో ఉన్నారు. ఈ భూమిపై హైకోర్టు ఆర్డర్ 33912/2026 ఉన్న విషయం గ్రామ కార్యదర్శికి చెప్పినా కూడా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సిద్దిపేట సీపీ, సిద్దిపేట రూరల్ సీఐ, రాజగోపాల్ పేట ఎస్సైకి విచారణకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. డిపిఓ, డిఆర్ఓ విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

జోగిపేట యూనియన్ బ్యాంకుకు 18 ఏళ్లు

- ఖాతాదారుల మన్ననలు పొందుతున్న యూనియన్ బ్యాంకు
- రైతులు, పేదలకు సకాలంలో రుణాలు అందించాలి

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ (జనంసాక్షి): యూనియన్ బ్యాంకు మరింత అభివృద్ధి సాధించి, ఖాతాదారుల విశ్వాసాన్ని చూరగొంటూ దేశంలోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటిగా ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా గత నాలుగు నెలలుగా మేనేజర్ ఆదిత్య కుమార్ ఖాతాదారులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, వారి సమస్యలను పరిష్కరిస్తూ, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఆయన పనితీరు ఖాతాదారుల మన్ననలు పొందుతోందని పేర్కొన్నారు. బ్యాంకు 18వ వార్షికోత్సవం సందర్భంగా మేనేజర్ ఆదిత్య కుమార్‌తో పాటు సిబ్బంది అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), మాజీ ఎంపీపీ హెచ్. రామాగౌడ్, సీనియర్ పాత్రికేయులు ఆకుల రాంబాబు, రవీందర్, సతీష్, అరుణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో దళితులకు న్యాయం జరిగేనా?

- దాడులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- మనోహరాబాద్, శివ్వంపేట ఎస్ఐలను సస్పెండ్ చేయాలి: KVPS రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

మనోహరాబాద్, అక్టోబర్ 31 (జనంసాక్షి): మెదక్ జిల్లాలో దళితులపై జరిగిన దాడులపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఖ్వూరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖ్వూరా, ^ాఖాఔఖ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా జిల్లాలోని ఆరు గ్రామాల్లో దళితులపై దాడులు, మరో గ్రామంలో సామాజిక బహిష్కరణ ఘటనలు జరిగాయని ఆరోపించారు. మనోహరాబాద్ మండలం పీటీ కోనాయిపల్లిలో డప్పులు కొట్టినందుకు కనీస వేతనం అడిగిన దళితులపై సర్పంచ్, అతని అనుచరులు దాడి చేయగా 15 మంది మహిళలు, పురుషులు గాయపడ్డారని తెలిపారు. కుచారం, హవేలీ ఘనపూర్, కిష్టాపూర్, నవాబ్‌పేట్, ఎదులపల్లి గ్రామాల్లోనూ దాడులు, కులవివక్ష ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. నవాబ్‌పేట్‌లో దాడి ఘటనపై ఫిర్యాదు చేసినప్పటికీ వారం రోజుల పాటు కేసు నమోదు చేయలేదని, అనంతరం నామమాత్రపు కేసులు నమోదు చేశారని విమర్శించారు. అట్రాసిటీ కేసుల్లో నిర్లక్ష్యం వహించిన మనోహరాబాద్, శివ్వంపేట ఎస్ఐలను సస్పెండ్ చేయాలని, తూప్రాన్ డీఎస్పీని విచారణ అధికారి బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి స్పందిస్తూ దళితులపై జరిగిన దాడులపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎం. అడివయ్య, కె. మల్లేశం, నర్సిములు, దేవయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మేడేపల్లిలో నూతన మహిళా సంఘ భవనానికి భూమి పూజ

ఆత్మకూర్, అక్టోబర్ 30 (జనంసాక్షి): ఆత్మకూరు మండలంలో మేడేపల్లి గ్రామంలో రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నూతన మహిళా సంఘం భవనానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ చంద్రాయుడు యాదవ్, ఎంపీడీవో శ్రీ రామ్ రెడ్డి, డిసిసి జిల్లా కార్యదర్శి తులసి రాజ్ యాదవ్, భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొర బాబు యాదవ్, పంచాయతీ కార్యదర్శి శిరీష, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పరమేష్, బుక్ కీపర్లు, ఆశా వర్కర్లు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

కతేపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ

ఆత్మకూర్, అక్టోబర్ 30 (జనంసాక్షి): రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆత్మకూర్ మండలం కతేపల్లి గ్రామంలో గురువారం నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీరామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తులసి రాజు యాదవ్, మండల నాయకులు ఆర్. పరమేష్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నస్రీన్ బేగం, ఫీల్డ్ అసిస్టెంట్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడి కుమారుడి నిశ్చితార్థ వేడుకలకు ప్రముఖుల హాజరు..

పటాన్చెరు, అక్టోబర్ 30 (జనంసాక్షి): పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి కుమారుడు సందీప్ రెడ్డి వివాహ

నిశ్చితార్థ వేడుకలు శుక్రవారం హైదరాబాద్‌లోని జేఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం ఉదయం సందీప్ రెడ్డికి.. ఆర్టీసీ ఎండీ, సీనియర్ ఐపీఎస్ అధికారి వై. నాగిరెడ్డి కుమార్తె హర్ష్వితి తో నిశ్చితార్థ కార్యక్రమం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు, మాజీ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి తదితర

ప్రముఖులు హాజరయ్యారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి భార్య గీతారెడ్డి, కుమార్తె నైమిష రెడ్డి, ప్రజాప్రతినిధులు, హైదరాబాద్ పోలీస్

కమిషనర్ సజ్జనార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్దకల్, అక్టోబర్ 30 (జనంసాక్షి): మండల పరిధిలోని నీలిపల్లి, కుర్తిరావులచెరువు గ్రామాలలో శుక్రవారం ఇందిరమ్మ ఇల్లును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. నీలిపల్లి గ్రామానికి చెందిన ఇమాన్యుల్, కుర్తి రావులచెరువు గ్రామానికిచెందిన భగవంతు నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులతో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సింగల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సర్పంచ్ భగవంతు, నాయకులు బిలకంటి రాము,వెంకటన్న,సవరణ, మహబూబ్ అలీ, భాస్కర్ గౌడ్,వెంకటేష్ గౌడ్,గోపాలు ఆంజనేయులు,ప్రదీప్ రెడ్డి, ప్రవీణ్, తిమ్మప్ప, తిమ్మరాజు,అజయ్,తదితరులు పాల్గొన్నారు.

ముట్రాజ్ పల్లిలో మహిళ అదృశ్యం..

- పోలీసులకు ఫిర్యాదు

కౌడిపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి): మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం ముట్రాజ్ పల్లి గ్రామానికి చెందిన తిమ్మాపురం లక్ష్మి, భర్త సత్య గౌడ్, (50) అదృశ్యమైనట్లు ఆమె కుమారుడు తిమ్మాపురం సాయిరాం, తండ్రి సత్య గౌడ్, కౌడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం లక్ష్మి, గత మూడు నెలలుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతోంది. ఇంటి నుంచి బయటకు వెళ్లి వీధుల్లో తిరిగే అలవాటు ఉండటంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆసుపత్రిలో 10 రోజుల పాటు డీప్ టీఎంఎస్ చికిత్స చేయించినట్లు తెలిపారు. గత పది రోజులుగా ఆమె ఆరోగ్యం మరింత క్షీణించిందని పేర్కొన్నారు. అక్టోబర్ 29వ తేదీ రాత్రి 10:30 గంటలకు కుటుంబ సభ్యులు నిద్రించగా, అక్టోబర్ 30వ తేదీ తెల్లవారుజామున 3:50 గంటలకు లేచి చూసేసరికి లక్ష్మి, ఇంట్లో కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన మహిళ సుమారు 5.6 అడుగుల ఎత్తు ఉండి, పసుపు, ఎరుపు రంగులు కలిసిన చీర ధరించి ఉందని, ఆమెకు తెలుగు భాష మాత్రమే వచ్చునని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ అమర్, క్రైమ్ నంబర్ 230/2026 కింద మహిళ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

తునికిలో పీఎం కిసాన్‌పై అవగాహన

కౌడిపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి): మెదక్ జిల్లా కౌడిపల్లి మండల తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత నిధుల విడుదల సందర్భంగా రైతుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో దేశవ్యాప్తంగా అర్హులైన రైతు కుటుంబాలకు రూ.4.47 లక్షల కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. 24వ విడతలో భాగంగా 9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18,690 కోట్లకు పైగా నిధులు జమ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, శాస్త్రవేత్త నర్సి రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.డి. నల్కర్, శాస్త్రవేత్తలు రవి కుమార్, పి. శ్రీకాంత్, డాక్టర్ ఎస్. ప్రతాప్ రెడ్డి, పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఎల్‌నినో ప్రభావం, రబీ పంటల సాగు, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక, తక్కువ నీటితో పండించే పంటలు, వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం, వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువ కల్పించడం, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై వివరించారు. రైతులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఆధార్ అనుసంధానం పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 21 రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు కలిపి మొత్తం 121 మంది పాల్గొన్నారు. రైతులు శాస్త్రవేత్తలతో తమ సందేహాలను నివృత్తి చేసుకుని, రానున్న రబీ సీజన్‌కు అవసరమైన సలహాలు, సూచనలు పొందారు.

సమాజ సేవే లక్ష్యంగా సహన సంస్థ ముందడుగు

- కొంగోడులో ఉచిత వైద్య శిబిరం.. సర్పంచ్ స్వామి ప్రశంసలు

కొల్చారం, అక్టోబర్ 30 (జనంసాక్షి): సమాజ సేవే లక్ష్యంగా సహన సంస్థ ముందుకు సాగడం అభినందనీయమని కొంగోడు గ్రామ సర్పంచ్ దుబ్బగళ్ల స్వామి అన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం కొంగోడు గ్రామంలో సహన సంస్థ ఆధ్వర్యంలో, మలా ్లరెడ్డి ఆసుపత్రి సహకారంతో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ స్వామి మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు, మెరుగైన ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సహన సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

సేవే లక్ష్యంగా సహన సంస్థ ప్రస్థానం...

కొంగోడు గ్రామానికి చెందిన సాలె సత్య నారాయణ 2011 నుంచి వివిధ స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో అనుభవం సంపాదించారు. సాధన, స్కోప్, పద్మపాణి, కార్పెడ్, విహాన్, పీహెచ్ఎఫ్ఐ వంటి సంస్థలతో కలిసి పని చేసిన అనుభవంతో సమాజానికి తన వంతు సేవ చేయాలనే సంకల్పంతో 2025 డిసెంబర్ 17న సహన ఆర్గనైజేషన్‌ను స్థాపించారు. బాలల హక్కులను కాపాడటం, బాల్య వివాహాలను అరికట్టడం, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించడం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు సమాచారం అందించడం సంస్థ ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్నారు. బాల్యం ఆటపాటలతో, విద్యతో వికసించాలని.. చదువే దేశాభివృద్ధికి బలమైన పునాది అనే సందేశంతో సంస్థ

కార్యక్రమాలు కొనసాగిస్తోంది.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేష్, ఎంపీటీసీ ఉదయ వేమారెడ్డి, ఉపసర్పంచ్ సిద్ధిరాములు, యన్నారం యాదగిరి, శివకుమార్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్ మంజుల, ముత్యాలు, మల్లేశం, పాపమ్మ, నాగమణి, ఆశా కార్యకర్త లలిత, మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రీతం, కుమార్ రెడ్డి, శివ, సాత్విక, నర్సులు పావని, నందిని, ఫాతిమా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాగప్ప, మేనేజర్ మహమూద్ పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులకు అండగా IKP - దళారులను ఆశ్రయించవద్దని సూచన

సిర్గాపూర్, అక్టోబర్ 30 (జనంసాక్షి): సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ లిమల్లగారి విమల విట్టల్ రెడ్డిలి, ఏపీఎం సరితతో కలిసి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యం బస్తాలను తూకం వేసి కొనుగోలు ప్రక్రియను అధికారికంగా మొదలు పెట్టారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ... రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పిస్తోందని, రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి లబ్ధిపొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీ నాగమణి, వీవోఏలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

సోమక్కపేటలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోత

- లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం
- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో ప్రవీణ్, ప్రజాప్రతినిధులు

చిలప్‌చేడ్, 30 అక్టోబర్ (జనంసాక్షి): మండల పరిధిలోని సోమక్కపేట గ్రామంలోని గంగిరెద్దుల గూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ముగ్గు పోత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, గ్రామ సర్పంచ్ బెస్త దుర్గాచలం పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సొంతింటి కల సాకారం కానుందని, ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభర స్వామి, ఉపసర్పంచ్ నరేష్, కరణం శ్రీనివాస్, కిరణ్ గౌడ్, వార్డు సభ్యులు శ్రీనివాస్, యాదగిరి, సెక్రటరీ మోహన్, మల్లేశం, శ్రీశైలం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

కోహెడ, అక్టోబర్ 30 (జనంసాక్షి): నవంబర్ 5న కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేపట్టనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం పిలుపునిచ్చారు. కోహెడ మండలం తీగలకుంటపల్లిలో గ్రామశాఖ అధ్యక్షుడు ఇట్టిరెడ్డి అమర్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. మండలంలోని 27 గ్రామాల్లో ఉన్న 52 బూత్ కమిటీల పనితీరును సమీక్షించి, క్రియాశీలకంగా పనిచేయని వారి స్థానాల్లో ఆసక్తి ఉన్నవారికి అవకాశం కల్పిస్తామన్నారు. పాదయాత్రకు ప్రతి బూత్ నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు జాలిగం రమేష్, రాగుల మహేష్ యాదవ్, శక్తికేంద్రాల ప్రభారీలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహీనుద్దీన్

కొల్చారం, అక్టోబర్ 30 (జనంసాక్షి): కొల్చారం మండలం కోనాపూర్ గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని, కులం పేరుతో ఎవరినీ దూషించకూడదని ఎస్ఐ సూచించారు. సమాజంలో సమానత్వం, పరస్పర గౌరవాన్ని పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోత్కు నిర్మల మల్లేశం, ఉపసర్పంచ్ మురళీధర్ రావు, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కరువు పరిస్థితులపై పశుగ్రాసం,నీటి వసతుల సర్వే

- 62 మంది రైతుల నుంచి వివరాల సేకరణ

మహమ్మదాబాద్,అక్టోబర్ 30 (జనంసాక్షి): ప్రస్తుత కరువు పరిస్థితుల నేపథ్యంలో పశువులకు మేత కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్, గ్రామంలో పశువైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్‌రెడ్డి, ఆధ్వర్యంలో రైతుల నుంచి వివరాలు సేకరించారు. సుమారు 62మంది రైతులు తమ పంటలు,పొలాల్లో నీటి వసతులు,అందుబాటులో ఉన్న పశుగ్రాసం వివరాలను అధికారులకు అందించారు.పశువుల మేత అవసరాలు,కొరత ఏర్పడే అవకాశాలను అంచనా వేసి తగిన చర్యలు చేపట్టేందుకు ఈసర్వే నిర్వహించినట్లు డాక్టర్ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్యమ్మ,గ్రామ కార్యదర్శి, కృష్ణవేణి, పశువైద్య సిబ్బంది భార్గవి,బామ్లా నాయక్, రైతులు అన్నసారం రమణారెడ్డి, కే. హెచ్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దులగూడెంలో భూరీ సర్వే ప్రారంభం

మల్దకల్,అక్టోబర్ 30 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం మల్దకల్ మండలంలోని ఎద్దులగూడెం గ్రామంలో మండల తహసీల్దార్ ఝాన్సీ రాణిప్రారంభించారు.గ్రామ రైతులతో కలిసి కొబ్బరికాయ కొట్టి రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఝాన్సీరాణి మాట్లాడుతూ మండలంలోని ఎద్దులగూడెంతో పాటు అన్ని గ్రామాల్లో వ్యవసాయ భూములు, నాలాలకు సంబంధించి రీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.భూముల కొలతల ఆధారంగా సరిహద్దులను నిర్ధారించి ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు కురుమన్న, మండల సర్వేయర్ బీచుపల్లి,జీపీఓ లక్ష్మణ్, శేఖర్, జిల్లామాజీ ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో రక్తదానం.. 129 మందికి ప్రాణదాన యజ్ఞం!

- వనపర్తిలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం.. 129 యూనిట్ల రక్తం సేకరణ

వనపర్తి, అక్టోబర్ 30 (జనంసాక్షి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వనపర్తి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువత, విద్యార్థులు, పోలీసు అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.

ఈ శిబిరంలో మొత్తం 129 మంది రక్తదానం చేయగా, 129 యూనిట్ల రక్తాన్ని సేకరించి వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డి. సునీత రెడ్డి మాట్లాడుతూ.. సమాజం, దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం ఎంతో విలువైనదని, ఒకరు చేసే రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకొని స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు, పండ్లు అందజేశారు. శిబిరాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, లా అండ్ ఆర్డర్ డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ రమేష్, ఆత్మకూరు సీఐ శివకుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పల నాయుడు, జిల్లాలోని ఎస్సైలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ జ్యోతి, ఆర్ఎం డాక్టర్ జావీద్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బొట్టుబొట్టును కాపాడుకుందాం...

- ఎల్‌నినోపై కళాజాత ప్రదర్శన

శివ్వంపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి): జిల్లా కలెక్టర్ ప్రతిభాసింగ్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి రామచంద్రరాజుల ఆదేశాల మేరకు శివంపేట మండలం లోని మాగ్దుంపూర్ గ్రామం స్థానిక సర్పంచ్ సోము కృష్ణవేణి అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం (ఎల్ నినో) పై జిల్లాకు చెందిన కళాజత బృందం కళాకారులు నీటి సంరక్షణపై, ఎల్ నేను ఎదుర్కొనే అంశాలపై ప్రదర్శన నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు వారి పాటల రూపంలో పోయిన వర్షాకాలం లో మునుపటి కంటే 20% వర్షపాతం తక్కువ కురిసింది. ఏ జలాశయాల్లో నీరు నిండుగలేవని, అన్నీ ఖాళీ అయ్యాయి, అందుకే అందరికి ఒకటే మనవి చేస్తున్నాం రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి. నీళ్లను పొదుపుగా వాడుకోవాలి. పశువులు, మేకలు, గొర్రెలు ఎండ వేడిమిని తట్టుకోలేవు కాబట్టి పశువులను నీడలోనే ఉంచాలి పొద్దున్న మెతకు తీసుకువెళ్లి పశువులనను కాపాడుకోవాలి. వాతావరణంలో మార్పుల వలన మర్చిలో ఉండే ఎండలు నవంబర్ నెలలోనే ప్రారంభం అవుతాయాన్ని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇవి అన్ని దృష్టిలో ఉంచుకొని కరెంటు ఎక్కువగా వాడుతాం కాబట్టి కరెంటు ఉత్పత్తి తగ్గి పోతుంది కావున మనం అందరం కరెంటును పొదుపు గా వాడుకుందాం ఈ కార్యక్రమం లో కళాకారులు కొమ్ముల శేఖర్ గౌడ్, నేనావత్ మదన్ సింగ్, ధరవత్ రాజు, శివోళ్ల క్రిష్ణ, కారంగుల మాధవిలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదును బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి, డా.అంజనేయగౌడ్

మల్దకల్, అక్టోబర్ 30 (జనంసాక్షి): మండల కేంద్రంలో మహబూబ్‌నగర్- హైదరాబాద్ -రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై శుక్రవారం మండల కేంద్రంలోని వాల్మీకి భవనంలో నిర్వహించిన మండల స్థాయి పార్టీ శ్రేణుల సమావేశానికి ముఖ్య అతిథిలు ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి డాక్టర్ ఆంజనేయ గౌడ్,నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి హనుమంతు నాయుడు హాజరై,పట్టభద్రుల ఓటర్ నమోదుపై దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు అమూల్యమైనదేనని, బీఆర్ఎస్ శ్రేణులు ప్రతి గ్రాడ్యుయేట్స్ ను కలిసి ఓటు నమోదు చేయించాలని సూచించారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి ప్రతిష్టాత్మకమైనవని అన్నారు.అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ను ఓటరుగా నమోదయ్యేలా పార్టీ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఓటరు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరిని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసేలా అవగాహన కల్పించాలని ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ శ్రేణులు నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పటేల్ జనార్దన్ రెడ్డి,నాగర్ దొడ్డి సత్యన్న, గాజులపాడు రఘువర్ధన్ రెడ్డి,మోనేష్,వీరేష్ గౌడ్,వెంకటేష్, పుణ్యమూర్తి,కవివీరేష్ సర్పంచులు,పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, యూత్ సభ్యులు పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల సాకారం.. ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశం

కొత్తపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి): పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగా కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి తండాలో శుక్రవారం ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంట్లో లబ్ధిదారు లక్ష్మీబాయి, భర్త లక్ష్మణ్ నాయక్ కుటుంబ సభ్యులు నూతన గృహప్రవేశం చేశారు. ఎన్నో ఏళ్లుగా గుడిసెల్లో, అద్దె ఇళ్లలో నివసిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సొంత ఇల్లు సమకూరడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. నూతన ఇంట్లోకి అడుగుపెట్టిన లక్ష్మీబాయి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి అజయ్, ఎంపీటీవో, వార్డు సభ్యుడు రవి, పాండు నాయక్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేతిరెడ్డిపల్లిలో పశువుల చోరీ.. రైతుకు భారీ నష్టం!

మూడు గేదెలు, మూడు దూడలను అపహరించిన గుర్తుతెలియని వ్యక్తులు.. ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత రైతు!

బాలానగర్, అక్టోబర్ 30 (జనంసాక్షి): బాలానగర్ మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో పశువుల చోరీ ఘటన కలకలం రేపింది. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రైతుకు చెందిన మూడు గేదెలు, మూడు దూడలను అపహరించుకెళ్లారు. ఆరు పశువులు ఒకేసారి కనిపించకుండా పోవడంతో బాధిత రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. పశువులే జీవనాధారంగా జీవిస్తున్న తనకు ఈ ఘటనతో భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని కన్నీటి పర్యంతమయ్యాడు.

ఘటన వివరాల్లోకి వెళితే.. కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కావలి సందీప్ 12 గేదెలను పోషిస్తూ పాలు విక్రయించుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం సాయంత్రం ఎప్పటిలాగే పశువుల నుంచి పాలు పితికిన అనంతరం ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం పశువుల మంద వద్దకు వెళ్లి చూడగా మూడు గేదెలు, మూడు దూడలు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన రైతు చుట్టుపక్కల ప్రాంతాల్లో, ఇతర రైతుల వద్ద ఆరా తీసినా పశువుల ఆచూకీ లభించలేదు. ఎంతో కష్టపడి పోషించుకుంటున్న పశువులు ఒక్కసారిగా అపహరణకు గురికావడంతో తన కుటుంబ జీవనాధారానికి తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పశువుల ఆచూకీ కనుగొని

తమకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఈ ఘటనపై బాధితుడు బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించి పశువులను తిరిగి తీసుకురావాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ప్రభుత్వ స్థలాలను అక్రమిస్తే కఠిన చర్యలు

అమీన్పూర్, అక్టోబర్ 30 (జనంసాక్షి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ వెంకటేష్ హెచ్చరించారు. శుక్రవారం ఐలాపూర్ పరిధిలోని సర్వేనెంబర్ 208లో అక్రమంగా వెలసిన దుకాణాల సముదాయాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీరంగూడ కిష్టారెడ్డిపేట్ వెళ్లే దారిలో ఐదాపూర్ గ్రామ పరిధి 208 సర్వే నెంబర్లు ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా దుకాణాల సముదాయని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఇక్కడ వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తే గతంలో

ఉన్న అధికారులు తొలగించినట్లు తెలిపారు. ఇకపై ప్రభుత్వ స్థలాలను ఆక్రమించా లని చూస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా హనుమాన్ దేవాలయ ప్రథమ వార్షికోత్సవం

రాయికోడు,అక్టోబర్ 30(జనంసాక్షి): మండల కేంద్రమైన రాయికోడ్ లోని శ్రీ శ్రీ హనుమాన్ దేవాలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో దేవాలయాన్ని అలంకరణ చేశారు. పురోహితులు సకరామ్ జోషి, సందీప్ జోషీల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా గురువారం రాత్రి దేవాలయంలో భజన కీర్తనలు నిర్వహించి జాగరణ చేశారు. తదానంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాధా తుకారం, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చేవెళ్ల విట్టల్,వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, ఉపసర్పంచ్ శివకుమార్, గ్రామ పుర ప్రముఖులు శంకర్ గుప్తా,హనుమాన్ గుప్తా,విట్టల్ రావు కులకర్ణి, మాజీ ఉపసర్పంచులు ముత్యాల లక్ష్మణ్, అందపాటి అంజన్న, గ్రామ పెద్దలు ఎస్ మానయ్య, జీ నారాయణ,పలువురు గ్రామ పెద్దలు,వివిధ గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలమడుగులో వీవో భవనం తనిఖీ, వీబీజీ రామ్‌జీ, జలసిరి పనుల గుర్తింపు

ర్యాలమడుగు, అక్టోబర్ 30 (జనంసాక్షి): నిజాంపేటర్యాలమడుగు గ్రామపంచాయతీలో గురువారం వీవో భవనం తనిఖీ మరియు వీబీజీ రామ్ జీ, జలసిరి పథకాల పనుల గుర్తింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలోని వీవో భవనాన్ని సందర్శించి పరిశీలించారు. భవన పరిస్థితి, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం గ్రామపంచాయతీలో వీబీజీ రామ్ జీ మరియు జలసిరి పథకాల కింద చేపట్టాల్సిన పనులను గుర్తించారు.

ఇంకుడు గుంతలు, పశువుల తొట్టి, పంట కుంటలు, కమ్యూనిటీ సోక్ పిట్, బోరు రీఛార్జ్ స్ట్రక్చర్లు తదితర పనులను గుర్తించి వెంటనే ఎస్టిమేట్లు తయారు చేయాలని నిర్ణయించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు నవంబర్ 1 నుండి పనులు ప్రారంభించి డిసెంబర్ 30 లోగా పూర్తి చేయాలని తెలిపారుఈ కార్యక్రమంలో సర్పంచ్ పన్ను లాల్ గ్రామపంచాయతీ కార్యదర్శి, వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా కార్యాలయాల చుట్టూ తిప్పుతారా?

- **అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించాలి: ఏళ్ల సురేందర్ రెడ్డి**

ఉప్పునుంతల (జనంసాక్షి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఏళ్ల సురేందర్ రెడ్డి అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన పట్టభద్రులకు బీఎల్ఓల ద్వారా ఫోన్‌లు చేయించి, ధ్రువీకరణ పత్రాలతో కార్యాలయాలకు రావాలని ఒత్తిడి చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఓటర్ల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో నమోదు అవకాశం కల్పించి, తిరిగి కార్యాలయాలకు రావాలని కోరడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే అధికార పార్టీ ఓటర్లపై ఒత్తిడి తెస్తోందని ఆరోపించారు. అర్హులైన పట్టభద్రుల దరఖాస్తులను తిరస్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఎన్నికల అధికారులు అనవసర నిబంధనలతో ఓటర్లను ఇబ్బంది పెట్టకుండా అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటరు నమోదు ప్రక్రియలో సమస్యలు ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేయాలని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.

వైభవంగా కొత్తపల్లిలో పోచమ్మ తల్లి ప్రాణప్రతిష్ఠ

గుమ్మడిదల, అక్టోబర్30(జనంసాక్షి): గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ వి. ఆదర్శ్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో సర్పంచ్ మంజుల సత్తయ్య, ఉపసర్పంచ్ రామేశ్వరి ఉమారెడ్డి, అనంతారం సర్పంచ్ కొమ్ము శీను, తొంట అంజయ్య, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎద్దులగూడెంలో పౌర హక్కుల దినోత్సవం

- **తహసిల్దార్ ఝాన్సీరాణి**

మల్దకల్,అక్టోబర్ 30 (జనంసాక్షి): మల్దకల్ మండలం ఎద్దులగూడెం గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమానికి సభాధ్యక్షుత తహసిల్దార్ ఝాన్సీరాణి నిర్వహించిన సమావేశానికి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కురుమన్న హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూజస్టిస్ పున్నయ్య కమీషన్ ఆదేశాల మేరకు గ్రామంలోని అన్ని కులాల మతాల ప్రజలు ఎలాంటి అంటరానితనం పాటించకుండా ఐక్య మత్యాన్ని చాటుకుని కలిసిమెలిసి జీవించాలని అన్నారు.

గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతి లేకుండా దేవాలయ ప్రవేశం అందరూ ఉపయోగించుకోవాలని అన్నారు. గ్రామ ప్రజలు అందరూ కూడా ప్రతి తమ పిల్లలను కష్టపడి చదివించుకోవాలని అన్నారు.

చదువు ద్వారానే సమాజం మారుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిపిఓ లక్ష్మణ్, దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర సలహాదారుడు ఎస్.రంజిత్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కరీం,సర్వేయర్ బీచుపల్లి,కానిస్టేబుల్ సుధాకర్,బ్లూ కోర్టు కానిస్టేబుల్ జయపాల్ రెడ్డి,అంగన్వాడి టీచర్ ఆశ కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నారాయణపేట అక్టోబర్ 30 (జనంసాక్షి): రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వకొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే రైతులకు లబ్ది కలుగుతుందని జిల్లా సహకార అధికారి అంజనేయులు అన్నారు. శుక్రవారం నారాయణపేట పిఏసిఎస్ ఆధ్వర్యంలో సింగారం చౌరస్తాలో వరి కొను గోలు కేంద్రాన్ని ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయిస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని బోనస్‌గా క్వింటాలుకు 5వందలు లభిస్తాయని అన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలోఅసిస్టెంట్ రిజిస్ట్రార్ లావణ్య, సింగారం ఉప సర్పంచ్ లక్ష్మప్ప, కాంగ్రెస్ నాయకులు కె.శ్రీనివాస్ రెడ్డి, పిఏసిఎస్ కార్యదర్శి అశోక్ కుమార్,సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జుక్కల్‌లో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

పెద్ద శంకరంపేట్, అక్టోబర్ 30 (జనంసాక్షి): పెద్దశంకరంపేట మండలంలోని జుక్కల్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్థులకు పౌర హక్కులు, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, తమ బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించాలని అధికారులు సూచించారు. సమాజంలో సమానత్వం, న్యాయం, సామాజిక బాధ్యతలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నారాయణ, ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి, సురేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డ్ మెంబర్ ఆ మజాకా...

- వార్డ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి
- నీటి సంరక్షణ పై ప్రజలకు అవగాహన
- 10వ వార్డు సభ్యులు మంగల్ పల్లి సందీప్

కొడిపల్లి, అక్టోబర్ 30(జనంసాక్షి): కొడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని 10వ వార్డు సభ్యులు మంగళపల్లి సందీప్ కుమార్, వార్డులో పర్యటిస్తూ స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ప్రజలకు సూచించడం జరిగింది. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించవచ్చని, భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చని అవగాహన కల్పించడం జరిగింది.
అదేవిధంగా, వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద మినీ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మోటార్ల ద్వారా వృథా అవుతున్న నీటిని అరికట్టేందుకు నిర్ణీత పనివేళలు ఏర్పాటు చేసి, టైమర్ల సహాయంతో నిర్దిష్ట సమయాల్లో మాత్రమే మోటార్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. నీటిని పొదుపుగా వినియోగించు కోవడం ద్వారా నీటి వృథాను అరికట్టడంతో పాటు విద్యుత్‌ను కూడా ఆదా చేయవచ్చని ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు సభ్యులు సందీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీ నగేష్ కుమార్, వార్డు సభ్యులు బొంతమ్మ సంగప్ప, కారోబార్ ఎల్లం, కార్యాలయ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ ఘాతంతో పాడి గేదె మృతి...

- రూ.1.40 లక్షల నష్టం..
- పరిహారం అందించాలని బాధితురాలి విజ్ఞప్తి...

నిజాంపేట,అక్టోబర్ 30(జనంసాక్షి): మండల పరిధిలోని బల్లంచెర్లా తండాలో విద్యుత్ ఘాతానికి గురై మూడ్ లక్ష్మి భాయ్ కి చెందిన పాడి గేదె మృతి చెందింది. ఎల్‌టీ విద్యుత్ లైన్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. మృతి చెందిన గేదె ముర్రా జాతికి చెందినదని, దాని విలువ సుమారు రూ.1.40 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. ఈ ఘటనతో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ, పశువైద్య శాఖ అధికారులు స్పందించి తనకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనాస్థలాన్ని పశువైద్య శాఖ అధికారి నారాయణ, విద్యుత్ శాఖ లైన్‌మెన్ కిషన్ పరిశీలించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిజాంపేట్, అక్టోబర్ 29 (జనంసాక్షి): నిజాంపేట్ మండలంలోని ముంగే పల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ రేణుక దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యానికి గిట్టుబాటు ధరగా ఏ గ్రేడ్ కు రూ.2461, బి గ్రేడ్ కు రూ.2441 చెల్లిస్తుందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఉప సర్పంచ్ గంగారం, మాజీ సర్పంచ్ నవా పటేల్, కాం గ్రెస్ నాయకులు జింకల వెంకటేశం, ముఖ్మిన్, డీసీఎంఎస్ సిబ్బంది స్వప్న, యాదగిరి, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో స్వచ్ఛత అభియాన్

శివ్వంపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి): మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో జిల్లా సంక్షేమ అధికారి హేమాభార్గవి ఆదేశాల మేరకు శుక్రవారం స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రం లోపల అలాగే బయట పరిసర ప్రాంతాల్లో శుభ్రత పనులు చేపట్టారు. అదేవిధంగా కేంద్రాల్లో ఉన్న అనవసర మైన వస్తువులను తొలగించి, పిల్లలకు ఆహ్లాదకరం, సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు. అలాగే పిల్లలకు ప్రమాదం కలిగించే వస్తువులు ఏవైనా ఉంటే వెంటనే తొలగించాలని అంగ న్వాడీ సిబ్బందికి తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, అనవసరమైన సామాగ్రి, వ్యర్థాలను గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష, పంచాయతీ కార్యదర్శి వీణా సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానము ప్రాణదానంతో సమానం...

- రక్తదానం చేసి పోలీసు అమరవీరులకు ఘన నివాళి

శ్రీరంగాపూర్, అక్టోబర్ 30 (జనం సాక్షి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు.
శ్రీరంగాపూర్ మండలం నాగరాల గ్రామానికి చెందిన గణపురం విష్ణు, దొడ్డి శేఖర్ ఎస్సై హిమబిందు సూచన మేరకు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు తమ వంతు సహ కారం అందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని వారు సూచించారు.

వెంకటేష్ యాదవ్ మృతి తీరని విషాదం

బాలానగర్, అక్టోబర్ 30 (జనంసాక్షి): ఉడిత్యాల గ్రామానికి చెందిన యువ రైతు వెంకటేష్ యాదవ్ పాముకాటుతో మృతి చెందడం గ్రామంలో విషాదం నింపింది. విషయం తెలుసుకున్న చెర్లకోలా లక్ష్మారెడ్డి, వాల్యా నాయక్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామ ర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



కృష్ణ, అక్టోబర్ 30 (జనంసాక్షి): నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఓట్ బచావ్--దేశ్ బచావ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు కృష్ణ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శు క్రవారం ఢిల్లీకి తరలివెళ్లారు.

భూముల సమస్యలపై రీ సర్వే: ఆర్డీఓ రమాదేవి

చిన్నశంకరంపేట, అక్టోబర్ 30(జనంసాక్షి): చిన్నశంకరంపేట మండలం అంబాజీపేటలో భూముల రీ సర్వే పై గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమా దేవి, ఏడి కిషన్, డిఐ అజీమ్‌లు మాట్లాడుతూ.. రీ సర్వే వల్ల గ్రామంలోని భూములకు పటిష్టం గా హద్దులు నిర్ణయించబడుతుందన్నారు. గ్రామంలో ఉన్న 634 ఎకరాల్లో సర్వే నిర్వహించి ఎలాంటి భూ సమస్యలు ఉన్న ముందుగా గ్రామ సరిహద్దులు , నిర్వహించి భూ తగాధాలు లేకుండా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజల సహకారంతో గ్రామంలో ఉన్న భూమిని రీసర్వే నిర్వహించి రైతులకు అండగా ఉంటామన్నారు. ఏడి సర్వే కిషన్, డిఐ అజీత్ మాట్లాడుతూ.. గ్రామంలో వారం రోజుల్లో ఈ సర్వే ను ప్రారంభిస్తామని, ఈ కార్యక్రమంలో సర్పంచ్ సబితా రవిందర్ గౌడ్,మాజీ సర్పంచ్‌లు సాన బాల్‌కిషన్, సాన సత్యనారాయణ,సాన సాయిలు ఆర్ ఐ రాజు, వినయ్, సర్వేయర్ ,రైతులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డిగ్రీ చేసిన యువత

ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటు హక్కు నమోదు చేయాలి

- బిజెపి రాష్ట్ర నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి

ఆత్మకూర్, అక్టోబర్ 30 (జనంసాక్షి): డిగ్రీ చేసిన యువత ప్రతి ఒక్కరు పట్టణంలో ఒక హక్కు నమోదు చేయాలి అని బిజెపి రాష్ట్ర నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు, శు క్రవారంఆత్మకూరు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా బార్ అసోసియేషన్ సభ్యులను కలిసి మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందాలంటే డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ఫామ్‌తో పాటు డిగ్రీ మెమో, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫోటో తీసుకొని అటెస్టేషన్ చేయించి ఎమ్మార్వో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎలక్షన్స్ సహ ఇంచార్జ్ జింబే జ్యోతి శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు అశోక్ భూపాల్ యాదవ్, జిల్లా నాయకులు ఆనంద్, జనరల్ సెక్రటరీ పుల్లారి రమేష్, నరేష్ కుమార్, రాఘవేందర్ రెడ్డి, సమ్మద్, పోలేల రాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో

అంగన్‌వాడీ కేంద్రంలో సమగ్ర పరిశుభ్రత కార్యక్రమం!

బాలానగర్, అక్టోబర్ 30 (జనం సాక్షి): బాలానగర్ మండల కేంద్రం లోని అంగన్‌వాడీ కేంద్రంలో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ మార్గదర్శకాల ప్రకారం శుక్రవారం సమగ్ర పరిశు భ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలు, తరగతి గదులు, వంటగది తదితర ప్రాంతాలను శుభ్రం చేశారు. చిన్నారులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు పరిశుభ్రత, వ్యక్తిగత పారిశుద్ధ్యం ప్రాముఖ్యతపై చిన్నారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను బాధ్యతగా భావించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు నారాయణ, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, కమల తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు.

యమలోకంలో సందేశం నాటకానికి ప్రశంసలు

- జడ్చర్ల ఉపాధ్యాయ బృందానికి ప్రశంసలు

జడ్చర్ల, అక్టోబర్ 30 (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వ సౌజన్యంతో, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంపిక పోటీల్లో జడ్చర్ల ఉపాధ్యాయ బృందం ప్రదర్శించిన యమలోకంలో సందేశం" లఘు నాటకం విశేష ప్రశంసలు పొందింది. పూదత్తు కృష్ణమోహన్ కాన్సెప్ట్, దర్శకత్వంలో రూపుదిద్దుకున్న నాటకంలో యముడు, చిత్రగుప్తుడు ఆధునాతన శిక్షల ద్వారా సమాజంలోని మద్యపానం, డ్రగ్స్, ఫోన్ బానిసత్వం, కల్తీ వ్యాపారాలు వంటి రుగ్మతలను హాస్యభరితంగా ఎత్తిచూపారు. నాటకంలో పూదత్తు కృష్ణమోహన్, చక్రవర్తుల రమణాచార్యులు, సురగోని నరేష్, రత్నశేఖర్, యలకంటి భాస్కర్, దార్ల రాఘవేంద్రాచారి, సమీర్, నర్సింహులు, రాగసుధ, శ్రీనివాసులు వివిధ పాత్రల్లో నటించారు. శుక్రవారం జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో కల్చరల్ సెక్రటరీ యామినీ కనకతార, శ్రీశైలం, స్వరూపల చేతుల మీదుగా కళాకారులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రదర్శనను తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, ప్రముఖ నాటక దర్శకుడు, నంది అవార్డు గ్రహీత బి.ఎం. రెడ్డి ప్రశంసించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- **పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పిలుపు**

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 30 (జనంసాక్షి): రాబోయే హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియ, పార్టీ నాయకులు చేపడుతున్న కార్యాచరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, మండలంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించడం అభినందనీయమన్నారు. ఓటరు నమోదు అత్యంత కీలకమని, అర్హులైన ఒక్క పట్టభద్రుడు కూడా ఓటు హక్కు కోల్పోకుండా నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా పట్టభద్రుల వివరాలు సేకరించి, నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కోరారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ఐకమత్యంతో పనిచేయాలని, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి బలమైన పునాది పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

- **పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్**

నారాయణపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి): హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నారాయణపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె వెంకటేష్ గౌడ్ కోరారు. పట్టభద్రుల ఓటు ప్రజాస్వామ్యంలో విలువైన హక్కు అని, విద్యావంతులు తమ అభిప్రాయాలను ఓటు ద్వారా వ్యక్తపరచాలని సూచించారు. నవంబర్ 5 ఓటరు నమోదు చివరి గడువు కావడంతో ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యువత, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు అవగాహన కల్పించి ఓటరు నమోదులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఉచిత కంటి శిబిరంలో 55 మందికి కంటి పరీక్షలు

- **20 మందికి కంటి ఆపరేషన్లు**
- **జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి**

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 30 (జనంసాక్షి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా శుక్రవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం102 గదిలో నిర్వహించిన కంటి చికిత్స శిబిరం విజయవంతమైనట్లు జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో అర్హులైన క్యాటరాక్ట్ పొరగల 20 మందిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్ లోలయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి పంపినట్లు ఆయన తెలిపారు. రోగులకు శిబిరంలో ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు, మందులు అందజేశారు. ప్రతిఒక్కరు జీవితకాలము కంటిచూపును కలిగి ఉండుటకు ప్రతి రోజు నిత్య భోజనంలో విటమిన్- ఏ, కూడిన క్యారెట్, ఆకుకూరలు, చేపలు, ఆహార పదార్థాలు అధిక మొత్తంలో తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ, పోతుల సుకుమా రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఓరుగంటి. శ్రీనివాస్, బాదం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై డీఎల్ఎస్ఏ అవగాహన కార్యక్రమం

నారాయణపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి): బాల్యవివాహాలు, బాలలపై శోషణను అరికట్టి వారి హక్కులను కాపాడాలని సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, జూనియర్ సివిల్ జడ్జి వడ్లూరి సుష్మిత సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట, కోస్గిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్'లో భాగంగా ఐదో రోజు బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ బాల్యవివాహం నేరమని, ప్రతి బాలబాలికకు విద్య, ఆటపాటలు, స్వేచ్ఛగా ఎదిగే హక్కు ఉందని తెలిపారు. బాలలపై జరిగే వేధింపులు, మంచి స్పర్శ-చెడు స్పర్శపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోక్సో చట్టం–2012, బాల్యవివాహ నిరోధక చట్టంలోని నిబంధనలు, శిక్షలను వివరించారు. బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాల లోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే 1098 చైల్డ్‌లైన్ లేదా 100 పోలీస్ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలల శోషణ లేని సురక్షిత జిల్లాగా నారాయణపేటను తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కు సంరక్షణే ధ్యేయంగా ఢిల్లీకి కాంగ్రెస్ శ్రేణులు

- **కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ స్వయంగా బస్సులో ప్రయాణించిన మంత్రి వాకిటి శ్రీహరి**

మక్తల్, అక్టోబర్ 30 (జనంసాక్షి): ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఓట్ బచావో – దేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా, నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన సభకు మక్తల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఇచ్చిన పిలుపు మేరకు మక్తల్ నుండి ఢిల్లీకి బయలుదేరిన ప్రత్యేక బస్సులను మంత్రి వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేవలం ప్రారంభోత్సవంతో సరిపెట్టకుండా, స్వయంగా కార్యకర్తలతో కలిసి బస్సులో కొంతదూరం ప్రయాణించారు. ప్రభుత్వ, పార్టీ విధానాలపై నినాదాలు చేస్తూ శ్రేణుల్లో జోష్ నింపారు. ఆయనతో పాటు ప్రయాణించడం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించడం, ప్రజాస్వామ్య మూలాలను కాపాడుకోవడం మన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ మహా ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఢిల్లీ నిరసన సభను విజయవంతం చేసే దిశగా మక్తల్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా, దీక్షాదక్షతలతో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు

చిన్నంబావిని కరువు మండలంగా ప్రకటించాలి

- **సర్వసభ్య సమావేశంలో సర్పంచుల డిమాండ్**
- **గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై విస్తృత చర్చ**

చిన్నంబావి, అక్టోబర్ 30 (జనంసాక్షి): చిన్నంబావి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని మండలంలోని పలువురు సర్పంచులు అధికారులను కోరారు. చిన్నంబావి మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, పంటల నష్టాలతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని చిన్నంబావిని కరువు మండలంగా ప్రకటించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

అలాగే గ్రామాల్లో అంతర్గత రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అభిప్రాయపడ్డారు.

అధికారులు స్పందిస్తూ సర్పంచులు సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి, సంబంధిత శాఖల పరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనుల అమలులో ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో ఎంపీడీవో స్వర్ణ, ఆదర్శ్ గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో జిల్లా బృందం స్టిక్ ఆఫీసర్ లఘునాటక ప్రదర్శన

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 30 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ సచివాలయ అసోసియేషన్ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో నాగర్ కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి గోరటి చెన్నకేశవులు జూనియర్ అసిస్టెంట్ ఇతర శాఖల వారితో కలిసి స్ట్రిక్ట్ ఆఫీసర్ లఘు నాటికను కన్నుల విందుగా ప్రదర్శించారు. అనంతరం నిర్వాకులు కళాబృంద సభ్యులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాబృంద సభ్యులు చెన్నకేశవులు, వివిధ శాఖల బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న పడమటి ఆంజనేయ స్వామి కోనేరు

- **కోనేరు శుభ్రపరిచే పనులు ప్రారంభం**
- **మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ, సొంత నిధులతో ఏర్పాట్లు**
- **పనులను పరిశీలించిన ఆలయ అర్చకులు, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు**

మక్తల్, అక్టోబర్ 30 (జనంసాక్షి): రాబోయే పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని, స్వామి వారి దివ్య కోనేరును సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసే పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో, వారి సొంత నిధులతో ఈ పనులను చేపట్టినట్లు కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు అలుకూరి రవికుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, కోనేరును పూర్తిగా శుభ్రపరిచి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ శుభకార్యక్రమంలో భాగంగా సిబ్బంది కోనేరును సుభ్రం చేసే పనులను ముమ్మరం చేశారు.

?ఈ పనులను ఆలయ అర్చకులు ఆనంద తీర్థ చారి, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు అలుకూరి రవికుమార్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి సూచనల మేరకే కోనేటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. గతేడాది కూడా మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని కోనేరును పూర్తిస్థాయిలో సుందరీకరించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు కోనేటిలో పవిత్ర స్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు ఘనంగా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.